AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

13-7-2026 (Monday) MAIN EDITION

## మనవరాలికి కారు స్టీరింగ్ ఇచ్చిన ఎస్సైపై కేసు




**అక్షరటుడే, సైబరాబాద్ :** ఆరేళ్ల బాలికతో కారు డ్రైవింగ్ చేయించిన ఎస్సైపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నగరంలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంధంగూడబైరాగిగూడ రోడ్డుపై ఎస్సై పూజారి తిరుపతి తన మనవరాలికి డ్రైవింగ్ నేర్పిస్తున్న వీడియో వైరల్ అయింది. దీంతో సైబరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ విషయం డీజీపీ సీవీ ఆనంద్ వరకు వెళ్లింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అనాలోచిత చర్యకు సంబంధించి, సదరు అధికారిని సస్పెండ్ చేయాలని, శాఖాపరమైన విచారణను ప్రారంభించాలని డీజీపీ ఆదేశించారు.

## పౌరసత్వ హోదాపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అస్సాంలోని ట్రిబ్యునల్స్ ద్వారా విదేశీయులుగా ముద్రపడిన వ్యక్తుల పౌరసత్వ హోదాపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ లేదా, ఒకరిని విదేశీయుడిగా ప్రకటించడం నిష్పక్షపాతంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. గౌహతి హైకోర్టు, ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ట్రిబ్యునల్స్ ద్వారా మరో నిష్పక్షపాత విచారణ జరిగే వరకు విదేశీయులుగా ముద్రపడిన వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది.

## టెట్ ఫలితాలు విడుదల




అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ టెట్ ఫలితాలు సోమవారం మధ్యాహ్నం విడుదల అయ్యాయి. స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఫలితాలను రిలీజ్ చేశారు. రాష్ట్రంలో జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ విధానంలో టెట్ పరీక్షలు జరిగాయి. మొత్తం 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు.

## షాబాద్ కిల్లర్‌ను రేవంత్ సన్నిహితుడు కాపాడాడు



హరీశ్‌రావు అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రేవంత్ రెడ్డి హయాంలో ఆడపిల్లల తల్లిదండ్రులు భయపడే పరిస్థితి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. షాబాద్ కిల్లర్‌ను రేవంత్ సన్నిహితుడే పోక్సో కేసు నుంచి కాపాడారని ఆరోపించారు. ఓ మార్కెట్ కమిటీ చైర్మన్ రూ.20 లక్షలు లంచం తీసుకొని పోక్సో కేసులో రాజ్ కుమార్‌కు బెయిల్ వచ్చేలా చేశారన్నారు.

## ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్లు



అక్షరటుడే, ఏపీ : చారిత్రాత్మక ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఆధునీకరణ పనులను ఏపీ ప్రభుత్వం వేగవంతం చేసింది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధవళేశ్వరం బ్యారేజీకి చేరుకుని, కొత్త గేట్ల నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. సుమారు రూ. 152.95 కోట్లతో ఈ ఆధునీకరణ పనులను ప్రభుత్వం చేపట్టింది.

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో చుక్కెదురు



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయిందని కోర్టు తెలిపింది. ఒరిజినల్ సూట్ రూల్స్ ప్రకారమే విచారణ జరగాలని స్పష్టం చేసింది. ముందుగా చాంబర్ జడ్జి ముందు పిటిషన్ దాఖలు చేయాలని సూచించింది. ప్రతివాదులకు నోటీసులు లేకుండానే బెంచ్ ముందుకు పిటిషన్ రావడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. అయితే ఏపీకి వెంటనే నోటీసులు ఇవ్వాలన్న తెలంగాణ విజ్ఞప్తిని తిరస్కరించింది. పిటిషన్‌లో లోపాలు సరిదిద్దాకే విచారణ చేపడతామని తెలిపింది.



# సైకో కిల్లర్ మృతి..

- షాబాద్ హత్యల నిందితుడి మృతదేహం లభ్యం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు
- రాజ్‌కుమార్ సూసైడ్ చేసుకున్నట్లు అనుమానాలు

**రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన షాబాద్ ఆరు హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ మృతి చెందాడు. రాజ్‌కుమార్ ఆచూకీ కోసం పోలీసులు 11 బృందాలతో గాలిస్తున్నారు. ఈ క్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం పంజర్ల గ్రామం శివారులో అతడి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో సంచలనం సృష్టించిన ఆరుగురి హత్య కేసులో ప్రధాన నిందితుడైన రాజ్‌కుమార్ చివరకు శవమై కనిపించాడు. షాద్‌నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం పంజర్ల గ్రామం శివారులో అతడి మృతదేహం లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది.

**తప్పించుకోలేక ఆత్మహత్య..**

హత్యలు జరిగినప్పటి నుంచి ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు 12 ప్రత్యేక బృందాలతో రాజ్‌కుమార్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోలీసుల గాలింపు ముమ్మరం కావడంతో ఎక్కడా ఆశ్రయం దొరకని రాజ్‌కుమార్, చివరికి తన మేనమామ ఊరైన పంజర్లకు చేరుకున్నాడు. అక్కడ శివారు ప్రాంతంలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనా స్థలంలో పాయిజన్ బాటిల్ లభ్యమైంది.

**కేసు నేపథ్యం..**

తనపై పోక్సో కేసు నమోదు చేయించారనే కక్షతో రాజ్‌కుమార్.. కన్నబిడ్డలు, భార్యతో సహా తన కుటుంబంలోని ఆరుగురిని అత్యంత దారుణంగా నరికి చంపిన విషయం తెలిసిందే. ఈ దారుణం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితుడు చనిపోవడంతో ఈ కేసు విచారణ ముగింపు దశకు చేరుకుంది.

**పోలీసుల అప్రమత్తత..**

రాజ్‌కుమార్ ఆత్మహత్య తర్వాత పంజర్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు.

**ట్యూషన్ టీచర్‌ను ప్రేమించి..**

రాజ్ కుమార్ భార్య సరిత (33) అతనికంటే వయసులో ఆరేళ్లు పెద్దది. రాజ్ కుమార్ ఇంటర్ చదువుతున్న సమయంలో సరిత అతనికి ట్యూషన్ చెప్పే టీచర్‌గా పని చేసేది. అప్పట్లోనే ఆమెపై ప్రేమ పెంచుకున్న రాజ్ కుమార్, ఆమెకు వచ్చిన పెళ్లి సంబంధాలను చెడగొట్టి, పట్టుబట్టి 2018లో పెళ్లి చేసుకున్నాడు. నిత్యం తాగి వచ్చి వేధించడంతో భార్య సరిత విడాకులు కోరింది. దీంతో భార్యను, ఇద్దరు చంపేశాడని సమాచారం.

## భారీ బొగ్గు కుంభకోణం: కిషన్ రెడ్డి



**అక్షరటుడే, కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 'సింగరేణి భరోసా యాత్ర'లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ముందడుగు చర్యలను ప్రస్తావిస్తూనే, గత ప్రభుత్వాల వైఖరిపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. యూపీఏ హయాంలో దేశంలోనే అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎటువంటి వేలం ప్రక్రియ లేకుండా సింగరేణి సంస్థకు నేరుగా కేటాయించిన ఏకైక బొగ్గు గని 'తాడిచర్ల 2' బ్లాక్ అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని ఆరోపించారు.

## పింఛను కోసం వెళ్తే.. అకౌంట్‌లో రూ. 1,500 కోట్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పింఛను తీసుకుందామని బ్యాంకుకు వెళ్లిన ఒక వృద్ధుడు తన ఖాతాలో ఉన్న బ్యాలెన్స్ చూసి షాక్ అయ్యడు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. 82 ఏళ్ల కామేశ్వర్ మిశ్రా అనే వృద్ధుడు తన సామాజిక భద్రతా పింఛను తీసుకోవడానికి ఆదివారం కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)కు వెళ్లారు. ఆయనతో పాటు ఆయన దివ్యాంగుడైన కుమారుడు కూడా వెళ్లారు. పింఛను తీసుకున్న తర్వాత, తన ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చెప్పాలని మిశ్రా అడిగాడు. అతడి ఖాతాలో ఏకంగా రూ. 759 కోట్లకు పైగా బ్యాలెన్స్ ఉండడాన్ని చూసి ఆపరేటర్, మిశ్రా షాక్ అయ్యారు. ఆయన కుమారుడి ఖాతాను కూడా తనిఖీ చేయగా, అందులోనూ అంతే స్థాయిలో భారీ మొత్తం కనిపించింది. తండ్రీకొడుకుల ఖాతాల్లో కలిపి మొత్తం రూ. 1,500 కోట్లకు పైగా బ్యాలెన్స్ ఉండటం స్థానికంగా కలకలం రేపింది.

## ఘోర ప్రమాదం.. ఐదుగురు దుర్మరణం..



**అక్షరటుడే, తమిళనాడు:** తమిళనాడులోని మదురై జిల్లా కొట్టంపట్టి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. చెన్నై నుంచి మార్తాండం వైపు వెళ్తున్న ప్రైవేట్ ఆమ్ని బస్సు, అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి, ఎదురుగా వస్తున్న ప్రభుత్వ రవాణా సంస్థ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేట్ బస్సు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

## రైతులకు గుడ్ న్యూస్.. 16 నుంచి వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు వాతావరణ శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ నెల 16 నుంచి అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15 వరకు ఎండల తీవ్రత కొనసాగనుంది. 16 నుంచి 19 వరకు అక్కడక్కడ వర్షాలు కురుస్తాయి. అయితే ఇవి రాష్ట్రవ్యాప్తంగా ఉండవు. ఈ వర్షాలతో గాలిలో తేమ ఎక్కువై ఉక్కపోత ఉంటుంది. అనంతరం ఈ నెల 20 తర్వాత విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఆటోను ఢీకొన్న ట్రక్కు.. ఇద్దరి మృతి




**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** మహబూబ్ నగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చేపల లోడుతో వెళ్తున్న ఆటోను ట్రక్కు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. బండమీదిపల్లి ఆర్టీవో కార్యాలయం సమీపంలో కోయిల్‌సాగర్ నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదంలో ముజాయిద్(38), జిలాని(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అజహార్‌ను 108 సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

## ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి : మంత్రి రాజనర్సింహ



**అక్షరటుడే, ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను వేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులందరికీ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లల్లో నులిపురుగులతో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, బరువు తగ్గడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని మంత్రి పేర్కొన్నారు. అందుకే ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేయించడం అత్యంత అవసరం అని పేర్కొన్నారు.

## రైలులో పూజా క్రతువు.. అధికారుల క్లారిటీ



**అక్షరటుడే, ఢిల్లీ :** భారతీయ రైలులో ఒక మతపరమైన కార్యక్రమం జరుగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రైలు బోగీలలో ఇలాంటి ఆచారాలను నిర్వహించడానికి అనుమతి ఉందా అని నెటిజన్లు ప్రశ్నించారు. దీనిపై తాజాగా రైల్వే శాఖ అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఐఆర్‌సీటీసీ ద్వారా ఒక ప్రైవేట్ పార్టీ బుక్ చేసుకున్న ప్రత్యేక సెలూన్ కార్‌లో ఈ పూజ జరిగిందని నార్తర్న్ రైల్వే తెలిపింది. సెలూన్ కార్ అనేది ఉన్నతాధికారులు, ప్రముఖుల కోసం ఉద్దేశించిన ఒక ప్రైవేట్, విలాసవంతమైన రైలు బోగీ. ఇందులో ఏసీ పడక గదులు, చిన్న వంటగది (కిచెన్), లివింగ్, డైనింగ్ రూమ్, అటాచ్డ్ వాష్‌రూమ్‌లు ఇతర సౌకర్యాలు ఉంటాయి. కమర్షియల్ బుకింగ్ కింద సంబంధిత వ్యక్తులు రూ. 3,08,580 అడ్వాన్స్ చెల్లించి ఈ బోగీని బుక్ చేసుకున్నారు. ఈ బోగీలో అలాంటి కార్యక్రమాలు చేసుకోవచ్చని రైల్వే శాఖ తెలిపింది.